# ఛాందోగ్యం

ఆ లోకం...

ఆ – లోకం; దీనికన్న, అదో "మాఁలోకం."

– చచ్చి చెడి, ఏలాగో అక్కడికి ... దిగజారితే! కాదా, ఎగప్రాకితే...

ఈ లోకంలో చావని కావని బ్రతుకంతా పిశాచ, పీడగా ఆవహిస్తే, మరి, అప్పుడు...

ఆ లోకాన్నుంచి ... ఏ లోకానికి ఎగ, దిగ ...?

ధిక్ ... అఫ్సోస్...

చావంత చచ్చిన చావూ, మరొకటిలేదు.

చావు–బ్రతుకులు...

బ్రతకమని, యీ జోగాయ్ – మాధాయ్ లంతా, వేయి దేవుళ్ళకు మొక్కుకుంటున్నారు.

... బ్రతికుండగానే ...

– బ్రతకనుకదా అనే నిరాశతో, పెళ్ళాం మెళ్ళో పుస్తే – పూసా, భువనేశ్వరంలో ఆ సామి–సన్నిధిని...మీదు కట్టింది –

చచ్చిపోతే...నేను చచ్చినంత ఒట్టు...

నామీద...నామీద...ఒట్టే –

అక్కడా, అక్కడా అడ్రస్ తెలియని ప్రియురాళ్ళందరూ...

రాళ్ళకూ, రప్పలకూ, మొక్కుకుంటా రంటావా?

ఒక్కతె ముక్కూ మొగమైనా జ్ఞాపకం లేదు. ఇప్పుడు ... నిజం చెప్పొద్దూ – ఉహూఁ...

ఒప్పుకోను...

అబ్బ! ఒప్పుకోనంటే, ఒప్పుకో నోహో అని, నన్ను, ముప్పతిప్పలూ పెట్టలా, అవాళ ... అప్పన్న మేనకోడలు?

అదేనయ్యా...దీం తస్సాదియ్యా.

అప్పటికీ...ఇప్పటికీ...

మన మగసిరిమీద, ఈ టెపోటు...

అబ్బ!...పో–టు...

...మెత్తహో ఉండేవి కావూ దాని చెంపలు?

...కెంపులు చుట్టూతా, మధ్య మాంచి రవ్వ...ఆ దుద్దుల్లో తళుక్...

– హా...బ్బా–ఎడం డొక్కలో క–ళుక్...మంది.

– మందిచ్చినప్పుడల్లా పుచ్చుకోవాలా, ఏం –

గుచ్చుకుంటుందోయ్...చెన్నకేశవులూ -

ఏపూట కాపూట, పంకజమ్మ చెల్లెలి చూపులు...యుష్మత్ సూదికి...తాతగా - ముత్తాతగా...గుచ్చుకునేనోయ్...

అచ్చాయిగాడి మేనత్తను - కొంచెం కదలేసి, సంగతేమిటో తేల్చవే అని, హెచ్చరించడానికే, మనకు ముచ్చెమటలూ పోసినాయ్...

అసుపోసినట్టుగా, అటూ ఇటూ తచ్చాడి...అపక్కనుంచి ఈ పక్కకూ...యీ...

ఊఁ...ఈపక్కనే పడి ఉండనీయ రేమర్రా...

ఇటు ఒరిగినా..అటు తిరిగినా, మధ్య మీకు ఒరిగే దేముంది?

మీకు...ఏం ఒరిగిందీ?

నన్ను మరిగిందనుకుని, ఒళ్లు హూనం చేశాడు కదూ, సీనయ్య, అమ్మణమ్మను, అవాళ...తెల్లారిగట్ట...

ఇవాళ - గడిచేట్టు లేదేం? ఏమో లేకపోతే, ఏం!

..."ఏం రాకపోతే, ఓఁ - యబ్బో! నువ్వులేకపోతే ... నీ తాత, ..." అంది కాదూ, అక్కమ్మ ముత్తవతల్లి?

పిల్ల...పసందైందికదా అని, కొండమీది కోతులన్నీ దింపాను దానికోసం...

- కోసం ... మో...సం -

- నన్ను మోసం చెయ్యకండో అంటూ, ఇంటావిడ రాగాలు సాగించడానికి ... ఇంకా ఎంత టైమ్ ఉంది?

... ఇల్లా - బంగారం

దానిల్లు బంగారం కానూ...

"ఇల్లా వాకిలీ అంటూ కాస్త ఏర్పడితే... మీ పేరు చెప్పకుంటానండీ" అని, బ్రతిమాలుకుంది, పాపం, వారిజ:

... "ఇంటి వాసాలు లెఖ్ఖట్టేందుకు, నేనొక్కణ్ణే చాలునటే..." అన్నాను...చిన్న బుచ్చుకుంది...

అలా...నొచ్చుకోవడమే, దానికి అచ్చొచ్చింది.

- మరీ పచ్చహో ఉన్నాయేం, బత్తాయీలు?...ఫలంపాటు...

"ఆటూ పోటూ వేళ - అక్కడకాదు, ఇక్కడ ఉందాం రండి!" అని ... అది చిలకకు చెప్పినట్టు చెప్పింది...

ఉహూఁ...అంటే ఉహూఁ...

దానికన్న నేను తడిసి ముప్పందుమైనా...

కైనా, నాకు వాడితే, చెవుడు నీకు రావాలేం? -

ఏం సాంబశివుడూ, ఏం చేస్తూందిరా, మీ కన్నమ్మ...

...అన్నెము, పున్నెమే నెరుగనమ్మ...ఛస్, ప్రబంధంలో ఆడది పద్యం పాడకపోతే, ఏం?

ఏం - రోగం?

రోగం?-నాయ్-నాయ్:- అంటే పేదవాళ్ళకు వచ్చేది జబ్బు, మనది వ్యాధి, ఇతి వైజయంతీ...

కాంతిలో నిలువకే...నీ చెక్కులు, కందితే...

అందితే వదిలేవాణ్ణా? దానియక్క చాటున దాక్కుంటే మాత్రం?

...మాత్ర మింగినా, మంచినీళ్లు. తాగలేదు...మా మనోహరా...
తాగలేనూ? –
మీగడ తీసేసి తోడెట్టాలా ఏమిటే మీ అమ్మాయిని సింహాచలం?
– లేదు, బాబూ, పక్కింటి నాగేశ్వరికన్న, ఎటుచూసినా, మా చంటిదే కాస్త చిక్కన...
అందోయ్–అయ్‌తేనే రమ్మందోయ్...
ఓయ్ అనకముందే కోయిలను కవ్వించేదోయ్, కొంటెపిల్ల...
ఒంటస్వరాలనేవాళ్లం అప్పలస్వామి కూతుళ్లను –
అందుకోసం కాదుగాని అవాళ మొత్తానికి రంగారావుకు పళ్ళురాలినాయ్.
...టొంయ్–మనటమేకాని, అరవిందది అంతా వట్టి బోకరింపని నిమిషంలో తేల్చేశాం కాదూ?
అదిలక్ష్మి కళ్ళల్లో అదోమాదిరి అందం...
పందిరిమంచం మీంచి క్రిందికి దింపేట్టున్నారే?....
– బాలీసులాగా ఉండేది, గాలీబు మరదలు –
వరదా, మువ్వగో–పా...లా...
చాలించండోయ్ ఏడుపులూ...చావు, దగ్గిరకు రావడానికి హడలుతూంటేను! సుబ్బులూ...
మబ్బులు దుబ్బులుగా పుట్టడానికి, ఏమిటా మహత్తర కారణం?
దేశంలో లేస్తే మనకేం పట్టింది?...మనకు లేచిందే రణం...
ప్రణకిణాంకిత.. బిగ్గరగా ఆడవాళ్ళముందు అనేందుకు వీలులేకుండా, అక్కడ, ఓ బూతు తగలేయకపోతేనేం, జగాయ్?
...ముగ్గు చెరిపేస్తానని బెదిరిస్తే, బుగ్గలు నులిమేసింది కాదూ, అమాంతం... లక్ష్మీకాంతం –
ఎంత భారీమనిషో, స్వారి చేసినట్టుండేది...ఛాస్...సడీ చప్పుడూ లేకుండావచ్చి, జాజిపొదను గడ–గడలాడించేది...
మడిమే గా, కృష్ణుడిలో దక్కిన మానవత్వం...
పాపం నిత్యద్విత్వంగా బ్రతికిన బ్రతుకు...తల్లీ...
– మన గోడమీద మెసిలే బల్లికి, పిల్లలు ఎందరో? వల్లీ వల్లని మగడైతే...తల్లిప్రాణం కాదూ? మరి...తలనుంచి తోకకు వస్తుందా?
ఇంఖా పుండుకు రాస్తూంది ఇల్లాలు; మళ్ళా గట్టెక్కితే మాత్రం మర్యాద దక్కిస్తాననే నమ్మకం ఏమిటో?
అమ్మకచెల్ల నాదు మన సమ్మక చెల్లదు...ప్చ...తంజావూరులో ఏమూల చూచినా ఇలాగే తిక–మక:
...రకానికో కోరకాన్ని, గికురించే...
సకిమోమూగ–నాలేనీ...నా...
మనసా వాగబోకే – మళ్ళీ జన్మలో మనకు ఈ రంధి ఎలాగూ తప్పదు...
దుకూల చౌరాయ...నూతన జలధర రుచయే, గోపీ వధూ...టీ...

* * *